రైతు సంక్షేమమే

# ప్రభుత్వ లక్ష్యం

- సీఎం రేవంత్ ఏడాదిన్నరలో రూ.లక్ష కోట్లు కేటాయించారు
- సొసైటీ బ్యాంకులు రైతులందరికీ రుణాలిచ్చే స్థాయికి ఎదగాలి
- పులుసుబొంత ప్రాజెక్టు గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తా
- మణుగూరు డీసీసీబీ శాఖ ప్రారంభంలో మంత్రి తుమ్మల



డీసీసీబీ మణుగూరు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

మణుగూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఏడాదిన్నరలో రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష కోట్లు కేటాయించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పర్యటించిన ఆయన పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలో డీసీసీబీ మణుగూరుశాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీ బ్యాంకులు తమ పరిధిలోని రైతులందరికీ రుణాలు ఇచ్చే స్థాయికి చేరుకోవాలని, ఆ బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులు, పాలక వర్గాలు, సిబ్బందిపై ఉందని, గ్రామీణ ప్రాంత రైతాంగానికి ప్రయోజనాన్ని కల్పించే విధంగా సొసైటీ బ్యాంకులను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రైతు బంధు, ధాన్యం బోనస్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతులకు ఎంత వరకు సాయం చేయగలుగుతామో అంత వరకు చేస్తోందన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా రైతాంగానికి సంబంధించిన అన్ని అంశాలను ముఖ్యమంత్రి పరిష్కరిస్తూ వస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలకు వస్తే ములుగులో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశామని, భవిష్యత్‌లో మణుగూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశామని, ఈ పథకం పూర్తయితే 25 వేల నుంచి 30 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. చిరకాల కోరిక అయిన పులుసుబొంత ప్రాజెక్టు కూడా కార్యాచరణకు నోచుకోబోతోందని, అటవీ శాఖ క్లియరెన్స్ రావడంతో విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ ప్రాజెక్టును కూడా పూర్తి చేసి నియోజకవర్గ రైతులకు సాగు నీటిని అందించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈవో ఎన్.వెంకట్‌ఆదిత్య పాల్గొన్నారు.

## ‘వాలీబాల్’కు దిక్కెవరు?

- కోచ్ లేక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
- ఇక్కడి కోచ్ నల్లగొండ డీవైఎస్‌ఓగా బదిలీ
- రెండు నెలలుగా కోర్టు తాళాలు స్టేడియం కార్యాలయంలో జమ చేయని వైనం

6

సొంతగూడుపై..

# గంపెడాశలు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం
- బిల్లుల చెల్లింపుల్లోనూ అదే పరిస్థితి
- ఇప్పటి వరకు ఖమ్మం జిల్లా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.61 కోట్లు జమ



వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు సూచనలు ఇస్తున్న గృహ నిర్మాణశాఖ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లపై నిరుపేదలు గంపెడాశలతో ఉన్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పలు దశల్లో పరిశీలించి, సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసింది. గతంలో నిర్వహించిన కులగణన సర్వేతో లబ్ధిదారుల వివరాలను సరిపోల్చి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఎల్1, ఎల్ 2, ఎల్3గా విభజించింది. స్థలం ఉండి ఇళ్లు లేని వారిని ఎల్1గా, స్థలం, ఇళ్లు లేనివారిని ఎల్2గా, గతంలో లబ్ధిపొంది, పక్కా ఆర్సీసీ ఇళ్లు ఉన్నవారిని ఎల్3 గా గుర్తించింది. ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో తొలి విడతలో 16,153 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో ఇప్పటి వరకు 12,173 ఇళ్లకు ముగ్గులు పోశారు. ఇప్పటి వరకు బేస్‌మెంట్ పూర్తయినవి 6,630, గోడలు పూర్తయిన ఇళ్లు 664, పైకప్పు పూర్తయిన ఇళ్లు 418 మాత్రమే. అయితే బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న వారిలో 90శాతం మందికి సుమారుగా రూ.61కోట్లు వారి ఖాతాలో జమ అయినట్లు తెలిసింది. లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5లక్షలు అందించాల్సి ఉన్నా దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండటంతో.. డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడానికి, బిల్లులు మంజూరు చేయడానికి కూడా తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు.

**లబ్ధిదారులకు చెల్లింపులిలా..**

లబ్ధిదారులు ముగ్గు పోయగానే కొలతలు వేసి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక ఇందిరమ్మ ఇంటి యాప్‌లో ఫొటో తీసి (మిగతా 6వ పేజీలో)

జిల్లాలో ప్రస్తుత పరిస్థితి ఇలా...

| నియోజకవర్గం | మంజూరైన ఇళ్లు | ముగ్గులు పోసింది | బేస్‌మెంట్ | గోడలు పూర్తయినవి | పైకప్పు పూర్తి |
|---|---|---|---|---|---|
| ఖమ్మం | 3044 | 953 | 279 | 1 | 7 |
| పాలేరు | 3447 | 2993 | 2052 | 235 | 88 |
| మధిర | 2767 | 2334 | 647 | 15 | 77 |
| సత్తుపల్లి | 3456 | 3096 | 2215 | 310 | 140 |
| వైరా | 2912 | 2380 | 1234 | 90 | 89 |
| ఇల్లెందు | 527 | 417 | 203 | 13 | 17 |
| మొత్తం | 16153 | 12,173 | 6630 | 664 | 418 |

### పైలెట్ ప్రాజెక్టు కింద 680 మంది ఎంపిక

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న ఖమ్మం జిల్లా పరిధిలో 21 మండలాల్లోని 21 గ్రామాల్లో ఎల్1 కింద 680 మందిని ఎంపిక చేసి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అయితే అందులో కొన్నిచోట్ల అనర్హులున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత రెండు మూడు సార్లు సర్వే నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు పునాదులు పూర్తిచేసిన ఇళ్లకు రూ.61కోట్లు, స్లాబు వేసిన ఇళ్లకు రూ.7కోట్లు మంజూరైనట్లు ఆ మొత్తం లబ్ధిదారుల ఖాతాకే జమైనట్లు గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియలో.. బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.



సత్తుపల్లిలో బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం సరిరామ్

## డిపోల బలోపేతానికి కష్టపడి పనిచేయండి

- ఉద్యోగుల సమష్టి కృషితోనే అదనపు ఆదాయం సాధ్యం
- ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సరిరామ్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డిపోలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సిబ్బంది అందరూ కష్టపడి పని చేయాలని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎ.సరిరామ్ సూచించారు. సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించిన ఆయన అనంతరం డిపో పరిధిలోని దమ్మపేట, మండలపల్లి, అశ్వారావుపేట బస్టాండ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బుకింగ్ చాట్ వద్ద డ్రైవర్లు, కండక్టర్ల కేటాయింపు, ఎర్నింగ్ సెక్షన్, టిమ్స్ లాంటి వివరాలపై డీఎం రాజ్యలక్ష్మితో చర్చించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రీజియన్‌లో 56 సర్వీసులు పెంచామని, సత్తుపల్లి డిపో పనితీరు, ప్రదర్శన గతం కంటే మెరుగ్గా ఉందని, కానీ రాఖీ ఆదాయం మాత్రం రీజియన్‌లో ఈసారి తగ్గిందన్నారు. రాఖీ పౌర్ణమి రోజున 112 ఆక్యూపెన్సీ రేషియో రాగా.. మనకంటే కరీంనగర్, వరంగల్ డిపోలు ముందంజలో ఉన్నాయన్నారు. ఈసారి హైదరాబాద్ నుంచి సమస్యలు తలెత్తకుండా 7,8 తేదీల్లోనే 127 బస్సులు నడపడంతో అదనపు ఆదాయం సాధ్యమైందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు పూర్తిగా సహకరించారని, వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బస్టాండ్‌లో వసతి సౌకర్యాలు, తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు, (మిగతా 6వ పేజీలో)

# కశ్మీర్ లోయలో ప్రమాదం

- సూర్యతండాకు చెందిన ఆర్మీ జవాన్ మృతి
- పుట్టినరోజు మరుసటి రోజే ఘటన

కారేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోయ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఆర్మీ జవాన్ సోమవారం జరిగిన ట్రక్ ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన బానోత్ అనిల్ (30) విధుల్లో భాగంగా గస్తీ నిర్వహించే ప్రాంతానికి ఆర్మీ ట్రక్‌లో బయల్దేరారు. ఈ క్రమంలో ఆ ట్రక్ ప్రమాదవశాత్తు లోయలో పడటంతో అనిల్ మృతిచెందినట్లు అక్కడి ఆర్మీ అధికారులు సూర్యతండాలోని అనిల్ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అనిల్‌కు భార్య రేణుక, ఎనిమిది నెలల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఇటీవల సెలవులపై స్వగ్రామానికి వచ్చిన అనిల్ 20 రోజుల క్రితమే కశ్మీర్ వెళ్లి విధుల్లో చేరాడు.

అయితే ఈ నెల 10న ఆదివారం అనిల్ పుట్టిన రోజు కాగా.. ఆయన ఆదివారం తన భార్య, ఇతర కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వారంతా అనిల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ మరుసటి రోజే విషాదకరమైన వార్త వినాల్సి రావడంతో ఆ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. అనిల్ మృతి వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలముకోగా.. మంగళవారం అనిల్ మృతదేహాన్ని విజయవాడ విమానాశ్రయానికి తీసుకు రానున్నట్లు సమాచారం.



మృతిచెందిన అనిల్ (ఫైల్)





# ‘నులి’పేద్దాం.. చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుదాం

### అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి 19ఏళ్ల వయసు వారిలో ఉండే నులిపురుగుల సమస్యను నివారించి.. వారికి ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు అందరూ కృషిచేయాలని కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం ఎస్సెస్సీ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల కడుపులో పెరిగే నులిపురుగులు వారు తీసుకున్న ఆహారం ద్వారా లభించే శక్తిని గ్రహించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. ఫలితంగా పిల్లలు బలహీనంగా, నిస్సత్తువగా, అలసటగా ఉంటారని, తరుచుగా అనారోగ్యం బారిన పడతారన్నారు. ఇలాంటి అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ఏటా ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ.. అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. 11న బడికి రాని పిల్లలు, మాత్రలు వేసుకోని వారుంటే మళ్లీ 18న నిర్వహించే మాప్ అప్ ప్రోగ్రాంలో తప్పకుండా వేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వందకు వంద శాతం మంది పిల్లలకు ట్యాబ్లెట్లు వేయాలని ఆయన అధికారులు, హెడ్‌మాస్టర్లు, టీచర్లకు సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల నులిపురుగులతో పాటు ఎలాంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందు నాయక్, శైలజ లక్ష్మి , అర్బన్ ఎంఈవో వి.రాజశేఖర్, ఏఎంవో హెడ్ మాస్టర్ ఎం. రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ కృష్ణ చైతన్య, మెడికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, డెమో సాంబశివారెడ్డి, డిప్యూటీ డెమో, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్




కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్)

## ‘భద్రాచలం రోడ్ -కొవ్వూరు’కు కదలిక

- 119 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు డీపీఆర్ సిద్ధం
- తాజాగా రూ.1,695కోట్లతో ప్రతిపాదనలు

6

## పాత పద్ధతిలోనే ‘పది’ పరీక్షలు

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్

బోనకల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి వార్షిక పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు విద్యాశాఖ అధికారులతో పాటు విద్యాశాఖలోని అన్ని విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలను పంపారు. 20శాతం ఇంటర్నల్, 80శాతం ఎక్స్‌టర్నల్ మార్కుల విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. గతేడాది నవంబరులో ఇంటర్నల్ మార్కుల విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. వంద మార్కులు పూర్తి పరీక్షల నిర్వహణ ద్వారానే చేపట్టింది. ఇటీవల జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన వర్క్‌షాప్‌లో మార్కుల విధానంపై పలు ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ పాత పద్ధతిలోనే పరీక్షల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిసింది. ఈ విధానంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముత్తంగి అలంకారంలో
# భద్రాద్రి రామయ్య

భద్రాచలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

## భారీ వర్షానికి ముష్టికుంట్ల
# ఊర చెరువుకు బుంగ

### రిటైనింగ్ గోడల వల్ల తప్పిన ప్రమాదం

బోనకల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ముష్టికుంట్ల ఊర చెరువుకు పెద్ద బుంగ పడింది. చెరువు కట్టకు ఆధునీకరణ పనుల్లో భాగంగా గతంలో నిర్మించిన రిటైనింగ్ గోడలను రెండు వైపులా నిర్మించడంతో పెనుప్రమాదం తప్పింది. తూముల వద్ద వేసిన బుర్రల్లో ఒక బుర్ర పగిలి పోవడంతో నీటి వరద ఉధృతికి కట్ట కింద భూమి కోతకు గురైంది. అధికారులు స్పందించి బుంగను పూడ్చించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## దొంగ ఓట్లతో మళ్లీ
# ప్రధాని అయిన మోదీ



వర్షంలో నిరసన ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతోనే కేంద్రంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యారని, గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే నైతిక విజయమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ విమర్శించారు. దొంగ ఓట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత రాహుల్‌గాంధీ, నాయకురాలు ప్రియాంకగాంధీ సహా ఇండియా కూటమిలోని 300మంది ఎంపీలను అరెస్టు చేయటాన్ని ఆయన ఖండించారు. సోమవారం వైరాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ పాల్గొన్నారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే రోడ్డుపై బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కూడా ఎన్డీయేకు అండగా నిలిచిందని, ఎన్నికలు నిష్పక్షపాతంగా, నిజాయితీగా జరిగితే ఇండియా కూటమి అధికారంలోకి రావడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని స్పష్టం చేశారు. ఈ నిరసనలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు సూతకాని జైపాల్, సూరంపల్లి రామారావు, బోళ్ల గంగారావు, పణితి సైదులు, ధార్న రాజశేఖర్, కట్ల సంతోష్, పొదిల హరినాథ్, పగడాల మంజుల, పమ్మి అశోక్, నర్వనేని అశోక్, గోపాలరావు, వాంకుడోతు బీక్యా, కన్నెగంటి నగేష్, హుస్సేన్, పెద్దప్రోలు లక్ష్మయ్య పాల్గొన్నారు.


అయోధ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

## అయోధ్య కుటుంబ సభ్యులను
## పరామర్శించిన
# మంత్రి తుమ్మల

మణుగూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ దివంగత బొల్లోజు అయోధ్య చారి కుటుంబ సభ్యులను సోమవారం మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అయోధ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్య పడవద్దని ఎల్లవేళలా తన సహాకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకులు జంగం మోహన్ రావు, పుల్లారెడ్డి, మున్నాలక్ష్మీకుమారి, దుర్గాల సుదాకర్, కొత్తపల్లి సీతారాములు, బాడిస సతీష్, సొందె కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సువర్ణ అవకాశం
# ఎన్ఎంఎంఎస్

- నెలకు రూ. 1000 స్కాలర్ షిప్..
- ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు




కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్- కమ్- మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అనేది కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్ షిప్ కార్యక్రమం. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు తెలిపారు. ఇది ఆర్థికంగా బలహీనమైన వర్గాల ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ స్కీం ముఖ్య ఉద్దేశం 8వ తరగతి తర్వాత విద్యార్థులు డ్రాపవుట్ కాకుండా వారిని ప్రోత్సహించడం, ప్రాథమిక విద్యను కొనసాగించడం, అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● నేషనల్ మీన్స్- కమ్- మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎస్ఎస్) 2025 -26 స్కాలర్‌షిప్ వివరాలు. ఈ పథకానికి ఎంపికైన లక్ష మంది విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తి చేసే వరకు ఉపకార వేతనం లభిస్తోంది.

● అర్హత.. విద్యార్థులు ప్రభుత్వ/ ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు లేదా స్థానిక సంస్థల పాఠశాలల్లో 8వ తరగతిలో చదువుతూ ఉండాలి. వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3.50 లక్షలకు మించకూడదు. విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. (ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 5శాతం సడలింపు ఉంటుంది).

● కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ వర్తించదు.

● వయోపరిమితి : సాధారణంగా 13-15 సంవత్సరాల వయస్సులో 8వ తరగతి విద్యార్థులు అర్హులు.

● రాత పరీక్ష : ఈ స్కాలర్‌షిప్స్‌కు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్రస్థాయిలో రెండు సార్లు రాత పరీక్షలు నిర్వహిస్తారు.

**పరీక్ష విధానం..**

● మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్) 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 90 మార్కులు, ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటీవ్ మార్క్ లేదు.

● స్కాలస్టిక్ ఆప్టిట్యూట్ టెస్ట్ (శాట్) 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు. మొత్తం 90 మార్కులు, 7, 8 తరగతుల స్థాయిలో సోషల్, సైన్స్, మ్యాథ్స్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటీవ్ మార్కులు లేవు.

**ముఖ్య విషయాలు..**

● ఒక్కో విద్యార్థికి రూ.12,000 ప్రతి సంవత్సరం అందుతుంది.

● స్కాలర్‌షిప్ అత్యధికంగా 4 సంవత్సరాలపాటు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కొనసాగుతుంది.

● పదో తరగతిలో కనీసం 60 శాతం మార్కులు (ఎస్సీ/ఎస్టీ 55శాతం) సాధించాలి.

● ఏదైన కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ ఎను ఒకే సమయంలో రెండోదాన్ని పొందలేరు.

● స్కాలర్‌షిప్ ఎన్ఎస్‌పీ ద్వారా మాత్రమే పొందవచ్చు.

● ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుంది.

● విద్యార్థులు మ్యాట్ అండ్ శాట్ పరీక్షల్లో కనీసం 40 శాతం మార్కులు (ఎస్సీ/ఎస్టీ 32శాతం) సాధించాలి.

**దరఖాస్తు చివరి తేదీ ఈ నెల 31**

ఎన్ఎంఎంఎస్ పరీక్ష సాధారణంగా ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో నిర్వహిస్తారు. ఎన్ఎస్‌పీ ద్వారా దరఖాస్తు గడువు తేదీలు సంబంధిత రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన ప్రకారం మారవచ్చు. అధికారిక వెబ్‌సైట్ ప్రకటనలను పరిశీలించిన తర్వాత మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# వాలీబాల్ క్రీడకు దిక్కెవరు?

- కోచ్ లేక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
- ఇక్కడి కోచ్ నల్లగొండ డీవైఎస్‌వోగా బదిలీ
- రెండు నెలలుగా కోర్టు తాళాలు స్టేడియం కార్యాలయంలో జమ చేయని వైనం
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని వాలీబాల్ క్రీడాంశానికి కోచ్‌లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ శాట్స్ కోచ్‌గా పని చేసిన అక్బర్‌అలీ రెండు నెలల క్రితం నల్గొండ జిల్లా డీవైఎస్‌వోగా పదోన్నతిపై బదిలీ అయి వెళ్లడంతో సరైన కోచ్ లేక శిక్షణకు దూరమవుతున్నామని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా వాలీబాల్ కోర్టు తాళాలు సైతం సదరు బదిలీపై వెళ్లిన కోచ్ దగ్గరే ఉంచుకోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కోర్టు గేటు తాళాలు ఉదయం సాయంత్రం వేళల్లో బదిలీపై వెళ్లిన కోచ్ భార్య వచ్చి తీస్తుండటంపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు తాళాలను స్టేడియం అధికారులు స్వాధీనం చేసుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### వాలీబాల్ కోచ్ డీవైఎస్‌వోగా బదిలీ

సర్దార్ పటేల్ స్టేడియంలో సుదీర్ఘకాలం వాలీబాల్ కోచ్‌గా పని చేసిన అక్బర్‌అలీ రెండు నెలల క్రితమే డీవైఎస్‌వోగా పదోన్నతి పొంది నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా ఆయన స్టేడియంలో ఎంతో మంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ పోటీలకు పంపిన అనుభవం సైతం ఉంది. ఏడాది క్రితమే శాట్స్ నుంచి డీవైఎస్‌వోగా పదోన్నతి లభించినా.. జిల్లా ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు పదోన్నతిపై వెళ్లకుండా ఇక్కడే ఉంటూ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. కాగా రెండు నెలల క్రితం నల్గొండ డీవైఎస్‌వోగా వెళ్లాలని మళ్లీ శాట్స్‌కు అర్జి పెట్టుకోగా ఆయనను బదిలీ చేశారు. సుమారు ఇక్కడ నిత్యం 40 నుంచి 50 మంది క్రీడాకారులు శిక్షణ పొందే వారున్నారు. ఆయన బదిలీ కావడంతో ఆయా శిక్షణార్థులకు తర్ఫీదునిచ్చేవారు లేక శిక్షణ కుంటుపడింది.

### రెండు నెలలుగా తాళాలు జమ చేయని వైనం

నల్గొండ డీవైఎస్‌వోగా బదిలీ అయిన సదరు కోచ్ స్టేడియంలోని వాలీబాల్ కోర్టుల తాలూకా తాళాలు అతని దగ్గరే ఉంచుకోవడంపై క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా వాలీబాల్ కోర్టుల తాళాలు సదరు బదిలీ అయిన కోచ్ భార్య ద్వారా తెరిపిస్తుండటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



వాలీబాల్ కోర్టు గేటుకు తాళం వేసిన దృశ్యం

### కోర్టులోకి పలువురు క్రీడాకారులకు నో ఎంట్రీ

స్టేడియంలోని వాలీబాల్ కోర్టులోకి ఇప్పటికీ పలువురు క్రీడాకారులకు ప్రవేశం లేదు. వారు గతంలో ఇక్కడ కోచ్‌గా పని చేసిన శిక్షకుడు ఇన్ డిసిప్లేన్ కారణంతో వారిని కోర్టుల దరిదాపులకు రానివ్వకుండా ఇబ్బంది పెట్టేవాడని పలువురు క్రీడాకారులు వాపోతున్నారు. వాస్తవంగా గత కోచ్ జిల్లా వాలీబాల్ సంఘానికి సైతం దూరంగా ఉండేవాడు. ఆయా సంఘానికి సంబంధించిన క్రీడాకారులను సైతం కక్షతో కోర్టులోకి అనుమతించే వాడు కాదని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 'భద్రాచలం రోడ్ -కొవ్వూరు'కు కదలిక

- 119 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు డీపీఆర్ సిద్ధం
- నిర్మాణానికి తాజాగా రూ.1,695 కోట్లతో ప్రతిపాదనలు

భద్రాచలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల కాలంగా భద్రాచలం ఏజెన్సీవాసులు ఎదురు చూస్తున్న భద్రాచలం రోడ్ - కొవ్వూరు రైల్వే లైన్‌కు కదలిక వస్తోంది. 119 కిలోమీటర్ల పరిధిలో ఉండే ఈరైల్వేలైను ప్రాజెక్టుకు రూ.2,155 కోట్లు ఖర్చవుతుందని గతంలో రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ లోక్‌సభలో ప్రకటించారు. 2024 డిసెంబర్‌లో బీజేపీ ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ ప్రాజెక్టు మంజూరైనట్టు తెలిపారు. ఈ క్రమంలో భద్రాచలం రోడ్ - కొవ్వూరు రైల్వే లైన్‌కు ముందడుగు పడుతోంది. ఈ నూతన ప్రాజెక్టు నిర్మాణానికి అనుగుణంగా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధమైంది. సత్తుపల్లి నుంచి కొవ్వూరుకు దాదాపు 70కి.మీ. దూరంతో ఉండే ఈ మార్గానికి రూ.1,695 కోట్ల వ్యయంతో రైల్వే లైను నిర్మించాలని తాజాగా ప్రతిపాదించారు. భద్రాచలం రోడ్-సత్తుపల్లి వరకు రైల్వే మార్గం బొగ్గు సేకరణ కోసం సింగిల్ లైన్ మాత్రమే నిర్మించారు. ఈక్రమంలో ప్రయాణికులతో వెళ్లే రైళ్ల కోసం మరోలైన్‌ను నిర్మించాల్సి ఉంది. తెలంగాణ ప్రాంతంలో 48.58కి.మీ., ఏపీ ప్రాంతంలో 70.31 కి.మీ. మేర కొత్త రైల్వేలైను నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే సర్వే పూర్తి కాగా గతంలో సర్వేల్లో ఆటంకాలన్నింటిని మదింపు చేశారు. ఇదిలాఉండగా భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు ప్రస్తుం ఉన్న సింగిల్ లైన్‌లో రైళ్లు నడపడమా లేక అదనంగా మరో లైన్‌ను ఏర్పాటు చేస్తారా అనే దానిపై డీపీఆర్‌లో వివరాలు ఉన్నట్టు సమాచారం. అయితే అధికారిక ఆమోదం లభించిన తరువాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

# సొంతగూడుపై.. గంపెడాశలు

(5వ పేజీ తరువాయి)

ఆ స్థలంలోనే 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఇంటిని నిర్మించుకోవాలి. బేస్మెంట్ నిర్మాణం పూర్తికాగానే అధికారులు పరిశీలించి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తారు. అది మండల హౌసింగ్ ఏఈకి వెళ్తుంది. ఆ తర్వాత పరిశీలించి ఫొటో తీసుకుని డీఈ లాగిన్‌కు పంపిస్తారు. పరిశీలించాక గృహనిర్మాణ శాఖ పీడీకి సిఫార్సు చేస్తారు. అక్కడి నుంచి కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. వారు నిర్ధారించుకున్నాక రూ.లక్ష నిధులు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పైకప్పు వేసేంత ఎత్తు గోడలు నిర్మించాక మరో రూ.లక్ష నిధులు లబ్ధిదారుడి ఖాతాలో వేస్తారు. ఇంటి పైకప్పు సిమెంటు స్లాబ్ పూర్తయ్యాక మళ్లీ క్షేత్రస్థాయి నుంచి పరిశీలన చేసి ఫొటోలు అప్లోడ్ చేశాక కలెక్టర్ రూ.2లక్షలు విడుదల చేస్తారు. ఇంటికి ప్లాస్టింగ్, మరుగుదొడ్డి నిర్మాణం పూర్తిచేసి రంగులు వేశాక ఇల్లు పూర్తవుతుందని నిర్ధారిస్తూ ఫొటోలు యాప్లో అప్లోడ్ చేస్తే మరో రూ.లక్ష. ఇలా ఐదులక్షలు విడతల వారీగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు.

## డిపోల బలోపేతానికి
# కష్టపడి పనిచేయండి

(5వ పేజీ తరువాయి)

పరిశుభ్రతను పరిశీలించారు. ఆర్టీసీకి అభివృద్ధికి సిబ్బంది సమష్టి కృషే ముఖ్యమని, అప్పుడే అదనపు ఆదాయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రయాణీకులు మరిచిపోయిన వస్తువులను విధుల్లో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు ఆర్టీసీపై అధికారులకు సమాచారం ఇచ్చి తిరిగి అప్పగించడం కర్తవ్యమన్నారు. రాఖీ సందర్భంగా డిపోకు ఎక్కువ ఆదాయాన్ని తెచ్చినందుకు సిబ్బందిని ఆర్ఎం ప్రశంసించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీబీవో కిన్నెర ఆనందరావు ఉన్నారు.

### సత్తుపల్లి డిపోకు రాఖీ ఆదాయం రూ.35.45లక్షలు

రాఖీపర్వదినం సందర్భంగా ఆర్టీసీ సత్తుపల్లి డిపోకు ఒక్కరోజే రూ.35,45,329వచ్చిందని డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. 47,014కిలోమీటర్లు లక్ష్యం కాగా 50,749కిలోమీటర్లు బస్సులు తిరగ్గా 109శాతం ఆక్యుపెన్సీ రేషియా వచ్చిందన్నారు. రెగ్యూలర్ సర్వీసులతో అదనపు సర్వీసులను నడిపామని, ఆదివారం రాత్రి అదనంగా మరో 14బస్సులు నడిపామన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో చరిత్రలో ఒక్కరోజు ఎక్కువ ఆదాయం సాధించడం ఇదేనని హర్షం వ్యక్తం చేశారు.

# మామిడి మొక్కలకు కేరాఫ్ లోక్యాతండా


నారు పెంచేందుకు తెచ్చిన మామిడి టెంకలు

- అంట్లు సిద్ధం చేస్తున్న గిరిజన యువకులు
- ఏటా నర్సరీల్లో సుమారు 50లక్షల మొక్కల పెంపకం
- వనమహోత్సవానికి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వినతి


నర్సరీలో మామిడి మొక్కలు


అంట్లు కడుతున్న యువకుడు

కూసుమంచి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంటు మామిడి మొక్కలకు కేరాఫ్‌గా కూసుమంచి మండలం లోక్యాతండా నిలుస్తోంది. మామిడి మొక్కల పెంపకంలో ప్రసిద్ధి గాంచిన ఈతండాలో నర్సరీల్లో మామిడి మొక్కలు అంట్లు కట్టి పెంచేందుకు సిద్ధం చేస్తున్నారు. తండాలో సుమారు 100మందికి పైగా యువకులు మామిడి మొక్కలకు అంట్లుకట్టడంలో నైపుణ్యం సాధించారు. నర్సరీల్లో మొక్కలు పెంపకం చేపట్టిన విషయం తెలిసిందే. ఇలా సుమారు 20నర్సరీల ద్వారా ఏటా 50లక్షల మొక్కలకు పైగా పెంపకం చేపడుతారు.

### మేలు రకాలైన అంటు మొక్కలు

మేలురకాలైన బంగినపల్లి, తోతాపురి, హిమాయత్, మల్లిక, కేసరి, పునాస తదితర రకాలైన మొక్కలు అంట్లుకట్టి పెంచుతారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు తిరిగి మామిడి తోటల్లో అంటుపుల్లలను సేకరిస్తారు. జులై, ఆగస్టు నెలల్లో వివిధ రకాల అంటుపుల్లలను సేకరించి, నారుమొక్కలకు అంట్లు కడతారు. సుమారు మూడునెలల పాటు రెండునుంచి మూడు అడుగులు ఎత్తువరకు అంట్లు కట్టిన పుల్లలకు కొత్త ఆకులు వేసే వరకు పెంచి విక్రయాన్ని ప్రారంభిస్తుంటారు.

### ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో విక్రయం

ఉమ్మడి జిల్లాలోని రాజమండ్రి, కడియపులంక, అశ్వారావుపేట, తిరుపతి, చిత్తూరు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో విక్రయిస్తుంటారు.పెద్దనర్సరీ యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని వారికి విక్రయిస్తుంటారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, రవాణా సందర్భంగా కూలీలకు పనులు దొరుకుతుంది. మట్టి నింపడం, మొక్కలు వచ్చిన తర్వాత కలుపు తొలగించడం, గ్రేడింగ్ చేయడం, మందులు పిచుకారీ, కట్టుబడి వచ్చాక నారు మొక్కలకు అంట్లు కట్టడం, చివరకు రవాణా చేయడం వరకు సుమారు మూడునెలల పాటు కూలీలకు పనులు దొరుకుతుంది. తమ నర్సరీల్లో పెంచిన మొక్కలను తెలంగాణ ప్రభుత్వం వన మహోత్సవం కోసం కొనుగోలు చేయాలని గిరిజన యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన టీడీపీ నేతలు

మధిరరూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మధిరలోని 17వ వార్డులో సాయిబాబా గుడి సమీపంలో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాసిరెడ్డి రామనాథం చేతులమీదుగా విగ్రహావిష్కరణ చేశారు. పూలమాలలు వేసి ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. 17వ వార్డులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసుకోవడం అభినందనీయమన్నారు. పేద, బడుగు,బలహీన, దళితవర్గాల అభివృద్ధికి దేశంలో ఎవరూ ప్రవేశపెట్టని విధంగా ఎన్టీఆర్ సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. ఎన్టీఆర్ రాకతోనే అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు వేమూరి సునీల్‌కుమార్, చేకూరి శేఖర్‌బాబు, పట్టణ, రూరల్ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, మార్నీడి పుల్లారావు, నాయకులు రావి కోటేశ్వరరావు, గోపి, దోమందుల సామేలు, మేడా వెంకటేశ్వరరావు, రత్నకుమారి, వేల్పుల కొండ, వంకాయలపాటి నాగేశ్వరరావు, వీరమాచినేని అశోక్, నాగసులోచన, చట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# జిల్లాలో భారీ వర్షం

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. వాతావరణంలో అల్పపీడన ద్రోణి కారణంగా వర్షాలు పడుతున్నాయి. 13నుంచి ఐదురోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పటం తెలిసిందే.. ఖమ్మంలో బైపాస్‌రోడ్డు, ఇందిరానగర్ కాలనీ వైరారోడ్డు సమీపంలో అతిభారీ వర్షం నమోదయ్యింది. రాత్రి 6.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఖమ్మం వర్షాలకు వాహనదారులు అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి వాతావరణంలో మార్పు వచ్చినా సాయంత్రం నుంచి మేఘావృతం అయి ఉంది. రాత్రికి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో అన్ని వీధులు జలమయమయ్యాయి.

## వంగవీడు సాగునీటి పథకాన్ని జాలిముడి ప్రాజెక్టులా కాకుండా చూడాలి

**జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్**

మధిరరూరల్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మధిర మండలం జాలిముడి వద్ద నిర్మించిన సాగునీటి ప్రాజెక్టు వల్ల ఎటువంటి ఉపయోగం లేకుండాపోయిందని, ప్రస్తుతం వంగవీడులో రూ.600కోట్లతో నిర్మించనున్న సాగునీటి ప్రాజెక్టును అలా కాకుండా చూడాలని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. సోమవారం మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ముందు సీతారామ ప్రాజెక్టును పూర్తిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలకు నీరందించటం జరిగిందన్నారు. మంత్రులు గొప్పలు చెప్పుకోకుండా చెప్పినవన్నీ నెరవేర్చి శంకుస్థాపనలు చేసిన పథకాలన్నింటినీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, చిత్తారు నాగేశ్వరరావు, వైవీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'పందిరి' కూరగాయల సాగు..
# భలే బాగు!


బంతిలో అంతర పంటగా బొప్పాయిని సాగు చేసిన దశ్యం

● దశాబ్ద కాలంగా లాభాల బాటలో ఉద్యాన సాగు ● డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అంతర పంటల సాగు
● వినూత్న విధానాలతో ఆదర్శ కర్షకుడిగా నాగచంద్రుడు ● పొరుగు రాష్ట్రాలకు వెళ్లి సాగు పద్ధతుల పరిశీలన

బోనకల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య పంటలు వద్దు.. ఉద్యానవన పంటలే ముద్దు అంటున్నారు బోనకల్ మండలం ముష్టికుంట్ల రైతులు. అందరికీ భిన్నంగా కొత్త సాగు పద్ధతుల పట్ల మక్కువ చూపించి.. ఆ విధానాల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా 100 ఎకరాల్లో 30మంది రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. కొద్దిపాటి భూముల్లో సాగు చేసే వారు కొందరైతే, ఏకంగా 10 ఎకరాల భూమిలో ఉద్యాన సాగుకు శ్రీకారం చుట్టి అందరితో లాభాల రైతుగా ప్రత్యేక ముద్ర వేయించుకున్నాడు బొడ్డుపల్లి నాగచంద్రుడు. వాణిజ్య పంటల సాగుతో నష్టపోయిన రైతులు ఓవైపు వ్యవసాయం దండగ అనే భావనలో ఉండగా.. కొత్త పద్ధతుల్లో పుడమి తల్లినే నమ్ముకొని సాగును పండుగగా మార్చి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాడు. ఇష్టంతో చేసే కష్టానికి, కొత్త విధానాల సాగు ఆలోచనలు తోడైతే యువ రైతులు అద్భుతాలు సాధించవచ్చునన్న రైతు నాగచంద్రుడి వినూత్న సాగుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

### పందిరి విధానంలో కూరగాయల సాగు..

ఈ ఏడాది జూన్ నెలలో పందిరి విధానంలో ఎకరన్నర పొలంలో కాకర, ఎకరం భూమిలో బీర, మరో ఎకరం భూమిలో వంగ సాగు చేశాడు. 2 ఎకరాల్లో బంతి వేసి అంతర పంటగా బొప్పాయి వేశాడు. మరో 2 ఎకరాల భూమిలో మల్లె అంతర పంటగా గులాబీ సాగు చేశాడు. ఇంకో రెండు ఎకరాల భూమిలో బంతిని వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుతం పందిరి విధానంలో వేసిన బీర, కాకర గత 15 రోజుల నుంచి కోస్తున్నారు. వేసిన తరువాత 40 రోజుల్లో పంట చేతికొస్తుంది. మొత్తం 90రోజుల్లో పంట దిగుబడి కాలం పూర్తవుతుంది. బెంగుళూరు నుంచి హైబ్రిడ్ విత్తనాలను తెప్పించి విత్తాడు. ఎకరం బీర సాగుకు సంబంధించి విత్తనాల కొనుగోలుకు రూ. 15 వేలు, పశువుల ఎరువులకు రూ. 25వేలు, ఫెస్టిసైడ్స్‌కు రూ. 30వేలు, కూలీలతో ఇతరత్రా ఖర్చులు రూ. 30వేలు అయ్యాయి. ఇప్పటికీ 80క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మండలం నుంచి పలు గ్రామాల వ్యాపారులతో పాటు ఖమ్మం మార్కెట్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికే రెండు లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని, మరో 15రోజుల పాటు బీరకాయలు కోతకు వస్తూనే ఉంటాయని, వాటిపై దాదాపు రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని అంచనా. పెట్టుబడి పోను 3 నెలల వ్యవధిలో కనీసం రూ.1.50 లక్షలు మిగులు ఆదాయం వస్తుంది. బీరను తొలగించి అదే భూమిలో వచ్చే నెల 15 నుంచి టమాట సాగు చేయనున్నాడు. కొత్త విధానంలో మొదలు వంగ, పైన టమాట గ్రాఫ్టింగ్ పద్ధతిలో సాగుకు శ్రీకారం చుట్టనున్నాడు. బీర సాగు మాదిరిగానే కాకర కూడా పందిరి విధానంలో గత 15 రోజులుగా కోస్తున్నారు. ఇప్పటికి 40 క్వింటాళ్ల కాకర అమ్మగా రూ. 1.20 లక్షల ఆదాయం వచ్చింది. మరో 60 క్వింటాళ్ల వరకు దిగుబడి రానుంది. పెట్టుబడి లక్ష వరకు ఖర్చు రాగా, అది పోను రూ. 2 లక్షల వరకు ఆదాయం మిగులుతుంది. చిన్న సైజులో ఉండే స్టార్ కాకర కావడంతో మార్కెట్‌లో మంచి దిగుబడి ఉంది. దసరా వరకు కోతకు వస్తూనే ఉంటుందని ఆ తరువాత సొరకాయ సాగుకు సిద్ధం చేసుకుంటున్నాడు. పందిరి విధానంలో సాగు చేసిన రెండు ఎకరాల్లో పంటకు 3 నుంచి 4 నెలల కాల వ్యవధిలోనే రూ. 3.50 లక్షల ఆదాయం మిగులుతుంది.


వినూత్న పద్ధతిలో సాగు చేసిన వంగ ఇదే..

### ఉద్యాన పంటలతో దశాబ్ద కాలంగా లాభాల బాట

దశాబ్ద కాలంగా లాభాల బాటలో ఉద్యాన సాగు ఉండటంతో అందరి చూపు ఆదర్శ రైతు నాగచంద్రుడి విధానాలపై పడింది. పదేళ్ల క్రితం రెండున్నర ఎకరాల భూమిలో రాతి స్తంభాలు, ఇనుప తీగ వేయడానికి గానూ రూ. 10 లక్షల ఖర్చు పెట్టాడు. శాశ్వత పందిరి విధానం కావడంతో ఏడాది కాలంలో రెండు పంటల సాగు మీద ఈ భూమిపై రూ. 6 లక్షల ఆదాయం వస్తుంది. ప్రతి ఏటా దొండ, కాకర, టమాట సాగు చేస్తున్నాడు. పందిరి విధానంలో రెండు రకాల పంటను ఏడాదిలో వేసి లాభాలను ఆర్జిస్తున్నాడు.

### డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అంతర పంటల సాగు

రైతుకున్న పది ఎకరాల భూమిలో మొత్తం డ్రిప్ ద్వారా అంతర పంటలను సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది బంతిలో అంతర పంటగా బొప్పాయి, గులాబీలో మల్లె అంతర పంటగా సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా రెండు రకాల అంతర పంటలను రెండు పర్యాయాలు పండిస్తున్నాడు. బంతి పంట 120 రోజుల వ్యవధిలో పెట్టుబడి పోనూ లక్ష రూపాయల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం వంగ సాగుకు సంబంధించి కింద అడవి వంగ, పైన గ్రాఫ్టింగ్ అంకూర్ నితీష్ వెరైటీ వంగ మొక్కను హైదరాబాద్‌లోని ఉద్యాన వన నర్సరీ నుంచి మొక్కను తెచ్చి సాగు చేశాడు. గత ఏప్రిల్‌లో వేయగా జూన్ 12 నుంచి కోత కోస్తున్నారు. వారానికి 10 క్వింటాళ్ల చొప్పున ఇప్పటికి 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ. 1.40 లక్షలు రాగా, ఇంకా రెండు నెలల పాటు కోత వస్తుంది. ఎకరానికి లక్షన్నర వరకు ఖర్చు రాగా.. రూ. 1.50 లక్షలు మిగలనున్నాయి.



**వినూత్న పద్ధతిలో సాగు చేస్తే లాభాలు గడించొచ్చు..**
**- బొడ్డుపల్లి నాగచంద్రుడు ( ముష్టికుంట్ల రైతు )**

వినూత్న పద్ధతిలో సాగు చేస్తే ఉద్యాన పంటలపై మంచి లాభాలు గడించవచ్చు. ఆధునిక పద్ధతులను సాగులో తెలుసుకునేందుకు నేను మహారాష్ట్ర, పాండిచ్చేరి, ఛత్తీస్‌ఘడ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లాను. అక్కడ గులాబీ, చామంతి, బంతి సాగు విధానాలను చూసి ఇక్కడ ప్రారంభించాను. టమాట సాగులో స్టెకింగ్ విధానాన్ని అక్కడ చూసి అమలు చేశాను. ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలతో పంటలను సరికొత్త విధానాలతో సాగు చేస్తున్నాను. పట్టుదల ఉంటే ఉద్యాన పంటల సాగులో ఎవరైనా విజయం సాధించవచ్చు. వాణిజ్య పంటల కంటే ఉద్యానవన పంటల సాగు తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ ఆదాయం పొందవచ్చు.


కాల్వకు పడిన గండిని పూడ్చుతున్న దృశ్యం

## కాల్వకు పడిన గండిని పూడ్చిన అధికారులు

● ఇసుక మేటలను పట్టించుకోవాలని రైతుల వేడుకోలు

వేంసూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం కుంచపర్తి వద్ద ఆదివారం ఎన్నెస్పీ కాల్వకు గండి పడి రైతుల పొలాల్లోకి వరద పోటెత్తగా.. సోమవారం నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి కాల్వకు పడిన గండిని పూడ్చారు. అయితే కాల్వకు గండి పడడంతో.. వరదనీరు పొలాల్లోకి చేరి ఇసుక మేట వేసింది. దీంతో తమ పొలాల్లో ఇసుక మేటలను తొలగించాలని రైతులు కోరినప్పటికీ.. అధికారులు తమకేం సంబంధం లేదని అక్కడి నుంచి జారుకున్నారు. ఇదే విషయమై అధికారులను కోరగా.. ఐబీ, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు తమకు సంబంధం లేదంటే తమకు సంబంధం లేదని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఎన్నెస్పీ కాల్వలో సాగర్‌నీళ్ల ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు లాకులు ఎత్తకపోవడంతో కాల్వకు గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనిచేసి తమ పొలాల్లో ఇసుక మేటలను తొలగించడంతో పాటు పంట నష్టాన్ని అంచనా వేసి తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

### పంట నష్టపరిహారం అందించాలి

వల్లభనేని సత్యనారాయణ ( రైతు, కుంచపర్తి )



ఎన్నెస్పీ కాల్వకు గండి పడి నాకున్న నాలుగెకరాల పొలం లో ఇసుక మేట వేయడంతో వరి పొలమంతా నామరూపాలు లేకుండా పోయింది. ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. పట్టించుకోవడం లేదు. అధికారులు నా పొలంలోని ఇసుక మేటను తొలగించి పంట నష్ట పరిహారం అందించాలి.


ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్‌ను కల్లూరు సబ్ కలెక్టర్ ఉదయ్ యాదవ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.
– ఆంధ్రజ్యోతి, ఖమ్మం లీగల్

## డ్రంకెన్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ఖమ్మంక్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌పోలీసుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 65మందిపై కేసులు నమోదుచేసినట్లు ట్రాఫిక్ సీఐ బెల్లంసత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ఈస్పెషల్ డ్రైవ్‌లో 16కార్లు, 10ఆటోలు, 39 ద్విచక్రవాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


రాజీవ్ స్వగృహను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్

## రాజీవ్ స్వగృహ టౌన్‌షిప్ వేలానికి సర్కారు నిర్ణయం

● సెప్టెంబరు 6వ తేదీ వరకు టెండర్ దాఖలుకు అవకాశం
● ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం రూరల్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనల మేరకు పోలేపల్లి పరిధిలోని రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పూర్తయిన నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు బహిరంగ వేలాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ స్వగృహ భవన సముదాయాన్ని సోమవారం స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఇఇ నరేందర్ రెడ్డిలతో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ స్వగృహ టౌన్ షిప్ బహిరంగ వేలానికి సంబంధించిన జిల్లా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, బిల్డర్స్‌తో ప్రీ బిడ్ ముందస్తు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ స్వగృహ అనేది సొంత ఇంటికలను నెరవేర్చడానికి ఉద్దేశించి రూపొందించబడిన గృహ నిర్మాణ సముదాయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాజీవ్ స్వగృహ మంచి సదావకాశమన్నారు. పోలేపల్లి రెవెన్యూ పరిధిలోని మున్నేరు ఒడ్డున బహుళ అంతస్తుల భవనాలలో ఎనిమిది బ్లాకులు, తొమ్మిది ఫ్లోర్లు, ఒక్కో ఫ్లోర్‌కు 8 ఫ్లాట్లు ఉన్నాయన్నారు. మొత్తమ్మీద 576 ఫ్లాట్లు ఉన్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, ఇంటీరియల్ డెకరేషన్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ ప్రాజెక్టును మొత్తంగా ప్రాజెక్టుగా అందుబాటులో ఉన్న బహిరంగ భూమిని మినహాయించి ఉన్న చోట ఉన్న విధంగానే ప్రాతిపదికన విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇఎండీ చెల్లించడానికి సిద్ధంగా ఉన్న సంఘాలు, బిల్డర్లు, డెవలపర్లు, సహ వ్యక్తులు ఎవరైనా సెప్టెంబర్ 6వ తేదీ వరకు బహిరంగ వేలంలో టెండర్ దాఖలు చేయవచ్చన్నారు. ఉద్యోగులకు ఈ గేటెడ్ కమ్యూనిటీని అందు బాటులోకి తీసుకురావడానికి ఉద్యోగ సంఘాలు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో మున్నేరు రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ శాఖ అధికారి భూక్యా శ్రీనివాస్, జిల్లా టీఎన్జీ వోస్ అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 43 కేజీల ఎండు గంజాయి పట్టివేత

కారు స్వాధీనం.. ఒడిశా వాసి అరెస్టు

భద్రాచలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ) : భద్రాచలంలో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 43 కేజీల గంజాయిని తరలిస్తుండగా ఒడిశాకు చెందిన సురేంద్రసింగ్ రాజ్‌పుత్‌ను అరెస్టు చేశారు. భద్రాచలం ఇసుక రీచ్ సమీపంలో ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా ఉన్న మారుతి ఎర్టిగా వాహనంను ఆపి తనిఖీ చేయగా దాంట్లో గంజాయి లభ్యం కావడంతో రాజ్‌పుత్‌తో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ గంజాయిని ఒడిశాలోని పాడువ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అలాగే బూర్గంపాడు మండలం సారపాక వద్ద 12.25 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న కీలోతు బీమ్లా, మోకాల సుజాతలను అరెస్టు చేశారు.



పట్టుబడిన నిందితుడితో అధికారులు

## ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

» ఈనెల 14నుంచి 17వరకు భారీ వర్షాలు
» ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడి


ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి 292 ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటితో పాటు జిల్లా ప్రజావాణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు వివిధ అంశాలపై అందించిన 46 దరఖాస్తులను పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజాప్రతినిధుల దరఖాస్తు పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలు తెలుపుతూ లేఖ రాయాలని కలెక్టర్ తెలిపారు. పత్రికల్లో ప్రచురితమయ్యే ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు సంబంధించి సంబంధిత శాఖాధికారులు ఫాలో అప్ చేస్తూ వారం రోజుల్లో రిపోర్ట్‌ను అందించాలన్నారు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచనలను జారీ చేసిందని, ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరూ హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఆగస్టు 12వ తేదీ సాయంత్రం లోపు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల జాబితా పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు సంబంధించి అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌ఓ ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో. కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు ఇలా..**

● వైరా మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకు చెందిన డి.రాంబాబు ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనకు ఇంటి నెంబర్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

● మధిర లేడీస్ హాస్టల్‌లో నివాసం ఉంటున్న డి. వెంకటమ్మ తన భర్త కలెక్టర్ కార్యాలయంలో స్వీపర్‌గా పని చేసేవారని, 2023 సంవత్సరంలో మరణించారని, తన భర్త రికార్డులు పరిశీలించి స్వీపర్‌గా పని చేసినట్లు ధృవీకరణ పత్రం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకుంది.

● కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామంలోని హైస్కూల్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తనను ఎటువంటి కారణం లేకుండా ఉద్యోగం నుంచి తొలగించారని తనకు మళ్ళీ స్వీపర్‌గా అవకాశం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

● సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ మాంగ్య తమ సర్వే నెంబర్ 189/2/1 లో ఉన్న వ్యవసాయ భూమి తన పేరు మీద పట్టా చేయడంలేదని, తన పేరు మీద పట్టా జారీ చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు..

● రఘునాధపాలెం మండలం పువ్వాడనగర్‌కు చెందిన షేక్ బీబమ్మ, కట్ట మోహన్ దుర్గా, నల్ల నీలవేణి తమ గ్రామంలో 129 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని, 126 మంజూరు పత్రాలు పంపిణీ చేశారని, తమ 3 పేర్లు జాబితాలో ఉన్నప్పటికీ ఇప్పటి వరకు మంజూరు పత్రాలు అందించలేదని, ఇకనైనా ఇవ్వాలని కలెక్టర్‌ను వేడుకుంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు కొమ్ములేం లేవు..

● పనికోసం ఎన్ని సార్లు తిరగాలి? మీరే నా సమస్య తీర్చాలి.. అప్పటిదాకా వెళ్లేది లేదు
● ఖమ్మం ప్రజావాణిలో కలెక్టర్ వద్ద భీష్మించిన ఓ వృద్ధుడు

'ఎన్ని సార్లు మీ అధికారుల చుట్టూ తిరగాలండీ.. ప్రభుత్వ ఉద్యోగులు అంటే కొమ్ములేం లేవు.. మీరే నా సమస్య తీర్చాలి... అప్పటి వరకు ఎక్కడికీ పోయేది లేదు.. ఇక్కడి నుంచి కదిలేది లేదు' అంటూ ఓ వృద్ధుడు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వద్ద భీష్మించాడు. ఈ ఘటన సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జరిగింది. ఖమ్మం జిల్లా తిరుమలా యపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన పేరం దాసయ్య అనే ఎక్స్ సర్వీస్ మెన్ తనకు 1997లో ఖానాపురం హవేలీలో సర్వేనెంబర్ 37లో పేరం కాంతమ్మ పేరుతో 150 గజాల ఇళ్లస్థలాన్ని ఇచ్చారని, కానీ నేటి వరకు తమ భూమిని స్వాధీనం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేయర్ వచ్చి సరిహద్దు రాళ్లు చూపించి ప్లాటు స్వాధీనం చేసి పంచనామా రిపోర్టు ఇప్పించాలంటూ ఇన్నేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తనకు ముగ్గురు ఆడపిల్లలున్నారని, నిరుపేదనని కలెక్టర్ ఎదుట వాపోయారు. ఈ క్రమంలోనే 'మీరు సమాధానం చెప్పే వరకు నేను కదలను. ఎన్ని సార్లు తిరగాలి సార్.. తక్షణమే నా సమస్య పరిష్కరించాలి' అంటూ కలెక్టర్ ఎదుట అనడంతో అక్కడ ఉన్న వారంతా అవాక్కయ్యారు. ఆ తర్వాత ఆ వృద్ధుడిని పక్కన ఉంచి ఇతరుల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్.. ఆ వృద్ధుడి సమస్యను తెలుసుకోవాలని పక్కనే ఉన్న అధికారులకు సూచించారు. దీంతో వారు ఆ వృద్ధుడి నుంచి వివరాలు సేకరించ గా.. ఈ సమస్యను పరిశీలిస్తామని వృద్ధుడికి చెప్పడంతో ఆయన వెనుదిరిగారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## 'పాలస్తీనా ర్యాలీ'పై బీజేపీ ఆగ్రహం

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేతలు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పాలస్తీనా సంఘీభావం పేరుతో ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీపై బీజేపీ ఘాటుగా స్పందించింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో బీజేపీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులను అనుమతి లేకుండా ర్యాలీలో ఎలా పాల్గొన్నారని ప్రశ్నించారు. జాతీయ జెండాతో పాటు విదేశీ జెండాలను ఊపించడం, మతపరమైన భావజాలాన్ని పిల్లల మదిలో నింపే ప్రయత్నం చేయడం దేశ హితానికి విరుద్ధమన్నారు. నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటేల విద్యాసాగర్, సన్నీ ఉదయ ప్రతాప్, దేవకి వాసుదేవరావు, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, మందడపు సుబ్బారావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, ఆర్‌వీఎస్ యాదవ్, ఈదుల భద్రం, వేల్పుల సుధాకర్, రజినీ రెడ్డి, శ్రీరామనేనిమణి పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

తల్లాడ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ప్రాంతంనుంచి గంజాయి తెచ్చి విక్రయించే ముగ్గురు యువకులను తల్లాడ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి తల్లాడ మండలం అన్నారుగూడెం- గోపాలపేట గ్రామాల మధ్య శిథిలావస్థలో ఉన్న ఇంటి సమీపంలో గంజాయి విక్రయిస్తున్న తల్లాడ మండలానికి చెందిన యువకులు బెజవాడ అన్వేష్‌యాదవ్, ఆవుల దత్తుకృష్ణ, తమ్మిశెట్టి నాగబాబులను తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 60గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సోమవారం మధిర కోర్టుకు రిమాండ్ పంపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఎస్సై తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

మధిర రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్న పగిడిపల్లి నీలమ్మ(60) ఉదయం లేచిన తర్వాత ఇంట్లో ఉన్న ఇనుప మంచాన్ని బయటకు తీసుకువస్తుండగా ఇంటిగోడలకు తగిలింది. ఆమె పట్టుకున్న ఇనుప మంచం ద్వారా గోడల్లో ఉన్న విద్యుత్ వైర్లకు కరెంట్ సరఫరా అయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త గతంలో చనిపోగా.. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

## దొంగతనానికి వెళ్లి.. విద్యుత్ షాక్‌తో మృతి

● కోనాయగూడెంలో విషాదం


బొడ్డు పిచ్చయ్య మృతదేహం

నేలకొండపల్లి,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):దొంగతనానికి వెళ్లి విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కోనాయగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోనాయగూడెంకు చెందిన బొడ్డు పిచ్చయ్య(50) మద్యానికి బానిసయ్యాడు. పిచ్చయ్య కోనాయగూడెంలో ఉంటుండగా.. భార్య, పిల్లలు మాత్రం మూటాపురం గ్రామంలో ఉంటున్నారు. పిచ్చయ్య తనకున్న రెండు కుంటల స్థలంలో కుంట స్థలాన్ని గ్రామానికే చెందిన ఓవ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. ఆవ్యక్తి కిరాయికి తీసుకున్న స్థలంలో బెల్టు షాపు నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి పిచ్చయ్య బెల్టు షాపులో దొంగతనానికి వెళ్లాడు. రేకులకున్న బోల్టులు తీసి లోపలికి దూకేందుకు ప్రయత్నం చేయగా.. లోపల ఉన్న ఇన్‌వెర్టర్‌పై పడి విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం ఉదయం షాపు పక్కనే ఉన్న అంజనేయులు చూసి గ్రామస్థులకు తెలపగా, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య బొడ్డు కరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోపాలపురం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని సర్వాయ్‌పాడు గ్రామానికి చెందిన సోడె మంగయ్య(36) ఆదివారం రాత్రి మణుగూరు నుంచి బైక్‌పై అశ్వాపురం వస్తుండగా.. అశ్వాపురం నుంచి మణుగూరు వెళ్తున్న బైక్ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన మంగయ్యను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

## మహిళపై దాడి.. కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన కణతాల మల్లీశ్వరిపై అదే గ్రామానికి చెందిన కణతాల శ్రీనుతో పాటు మరికొంత మంది ఈ నెల 6వ తేదీన ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి గాయపర్చారు. ఘటనపై బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.





## 100 గ్రాముల బంగారం, 2లక్షల నగదు చోరీ

ఖమ్మంక్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పట్టపగలు భారీ చోరీ జరిగిన సంఘటన సోమవారం నగరంలో జరిగింది. చైతన్య నగర్‌లోని ఓఅపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కొత్తూరు దేవేందర్ సోమవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లారు. సుమారు 12 గంటల సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇద్దరు అపార్ట్‌మెంట్‌లోని 403 ప్లాట్‌లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న సుమారు 2లక్షల నగదు, సుమారు 100 గ్రాముల బంగారం చోరీచేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఇంటి వద్దకు వచ్చిన పనిమనిషి ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో యజమానికి సమాచారం ఇచ్చి తరువాత ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి దొంగతనం చేసిన వారిని ఫొటోలు సేకరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు

## డీఈఈటీపై అవగాహన కల్పించాలి

**అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి**

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): డీఈఈటీ పోర్టల్‌పై యువతలో ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగార్థులు, ఉద్యోగదారుల మధ్య డీఈఈటీ వారధిగా పని చేస్తుందని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణపై అధికారులకు వివరించారు. డీఈఈటీ ప్లాట్ ఫార్మ్ , యాప్ పని తీరు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డీఈఈటీ యాప్ ద్వారా ఇంటర్న్ షిప్, అప్రెంటిస్‌షిప్ వివరాలు, నైపుణ్య శిక్షణ సంస్థ వివరాలను, జాబ్ మేళా వివరాల సమాచారం రెగ్యులర్‌గా అందిస్తుందన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు ఈ పోర్టల్‌పై అవగాహన కల్పించాలన్నారు.

**జాయింట్ సర్వే చేయాలి:**

ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు జిల్లాలో చేపట్టే రోడ్డు నిర్మాణ పనుల వల్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు దెబ్బతినకుండా చూడాలని అదనపు కలెక్టర్లు ఆదేశించారు. కొత్త రోడ్ల మంజూరు సమయంలో తాగునీటి పైప్‌లైన్ తరలింపు పనులకు అంచనాలు రోడ్డునిర్మాణ వ్యయంలో పెట్టాలని, దీనికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు జాయింట్‌గా తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలు తీర్చే కాంగ్రెస్ ప్రభుత్వం

**మేయర్ పునుకొల్లు నీరజ**

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం 30,32,33,34, 36,47,48 డివిజన్లలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహేరా, స్థానిక కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను వివరించారు. వరదలు అధికంగా వచ్చిన సమయంలో మున్నేరు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేఎంసీ అధికారులు, కార్పొరేటర్లు చెప్పిన విషయాలను పాటించాలన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. నాయకులు ముక్తార్, కన్నం ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న మేయర్

## ప్రజాపాలనలో.. సొంత పాలన

- ప్రజాఫిర్యాదులు స్వీకరణకు అంతర్గత విభాగం
- కేఎంసీకి ఆర్థిక నష్టం చేకూర్చేలా పనులు
- వివిధశాఖల నుంచి వచ్చిన ఉద్యోగులతో తిప్పలు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్లు కొన్నేళ్లుగా సొంత పాలన చేస్తూ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. పరిధికి మించిన స్థాయిలో పొంతన లేని పనులు చేస్తూ కేఎంసీని వివాదాల్లోకి తీసుకొస్తున్నారు. ముఖ్యంగా గతబీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు కార్పొరేటర్లు వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చిన వారితో చిక్కులు వస్తున్నాయి.

**పొంతన లేని పనులకు కేంద్రంగా ..**

నగర జనాభా 5లక్షలకు చేరింది. నిత్యం సమస్యలను పరిష్కరించాలని కేఎంసీకి 50 నుంచి 60 మంది ఫిర్యాదుదారులు వస్తుంటారు. వీరిలో ఎక్కువగా వృద్ధాప్య, వితంతు, పింఛన్‌దారులు, ఇందిరమ్మ ఇళ్లు, సర్వే, రేషన్ కార్డులు, ఇంటి నెంబర్లు వంటి సమస్యలపై వినతిపత్రాలను తీసుకొని వస్తున్నారు. అయితే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను ప్రజాపాలన విభాగం కార్యాలయం లోపల ప్రజలకు కనిపించేలా అందుబాటులో బహిర్గతంగా ఉంటుంది. కానీ కేఎంసీలో మాత్రం అంతర్గతంగా ఒక గదిలో ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా పలు ఆరోపణలతో ఇటీవల ఇతర విభాగాల నుంచి ప్రజాపాలనకు ఉద్యోగులను విభాగాలను మార్పులు చేశారు. అలా వచ్చిన ఉద్యోగులు ఇప్పుడు కేటాయించిన పనులు చేయకుండా గతంలో తాము చేసిన పనులను చేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. పొంతన లేని పనులు చేస్తుండటంతో విభాగాల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. ఇక్కడే అవినీతికి బీజాలు పడుతున్నాయి. కాగా మూడు రోజుల క్రితం ఓ ఉద్యోగి(తండ్రి బీఆర్ఎస్ కార్పొరేటర్) తనకు సంబంధం లేని పనులు చేసి కేఎంసీకి రావాల్సిన ఆర్థిక వనరులను సగానికి తగ్గించాడు. ఇందులో అతను కొంత మాముళ్లు తీసుకున్నాడని విమర్శలు వెలువడ్డాయి. ఇంజనీరింగ్ విభాగంలోనూ కంప్యూటర్ ఆపరేటర్లుకు ప్రత్యేకంగా గదులు కేటాయింపులు చేశారు. దీంతో అనేక అవినీతి ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. పారదర్శక పరిపాలనకు అనేక విధానపరమైన చర్యలు తీసుకుంటున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మరోసారి అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలకు అనుకూలంగా ప్రజాపాలన విభాగ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.



ప్రజాపాలన విభాగం కార్యాలయం

## సమస్యల పరిష్కారానికి డ్రైవ్

**కమిషనర్ అభిషేక్ అగస్త్య**



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న సైదుబాబు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగరంలో విలీన ప్రాంతాలు అభివృద్ధితో పాటు ఇతర ప్రజా అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. 15వ డివిజన్‌లోని నివాసాలకు ఇంటినెంబర్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేయాలని వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు కమిషనర్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. అక్రమనిర్మాణాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి నెంబర్లు, నీటిపంపుల కనెక్షన్‌లు ఇతర సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, టీఎంసీ గుడిపూడీ సుజాతరాణి, ఏవో శ్రీనివాసరెడ్డి, ఆర్వో యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు నీటివిడుదల తగ్గింపు

కూసుమంచి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు అధికారులు నీటివిడుదల తగ్గించారు. గతంలో 4070 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా 2030 క్యూసెక్కులకు తగ్గించారు. వేంసూరు సమీపంలోని కుంచపర్తి వద్ద సాగర్ ఎడమకాల్వకు గండి పడిన సంగతి తెలిసిందే. దీంతో పాటు విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో నీటి డిమాండ్ తగ్గింది. పాలేరు జలాశయం నీటిమట్టం 23అడుగులకు 22.35 అడుగులకు చేరింది. సాగర్ డ్యామ్ నుంచి 3442 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. పాలేరు గరిష్ట నీటిమట్టానికి చేరువలో ఉండటంతో అధికారులు ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా జలాశయం రెండు ఫాలింగ్ గేట్లను కిందకు దింపి 150 క్యూసెక్కుల నీటిని పాలేరు ఏటిలోకి వదులుతున్నారు. పాతకాల్వకు 120క్యూసెక్కులు, భగీరథకు 135 క్యూసెక్కులు, 16,17 బ్రాంచ్‌కెనాల్‌కు 431 క్యూసెక్కులు, మంగాపురం మేజర్‌కు 214 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



## 13న డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 13న ఉమ్మడి జిల్లా స్థాయిలో, డిగ్రీకళాశాలల, విద్యార్థులకు, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ జాకీరుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల చరిత్ర విభాగం, ఐక్యుఏసి సంయుక్త ఆధ్వర్యంలో, భారతదేశ స్వాతంత్రోద్యమం-ప్రపంచానికి ఆదర్శం అనే అంశంపై బుధవారం ఉదయం 11గంటలకు ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలుగు, ఇంగ్లిష్ హిందీ భాషల్లో రాయొచ్చునని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7981952341, 7731944849 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## ప్రథమ బహుమతి గెలుచుకున్న 'ఖరీదైన జైళ్లు'

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 7 నుంచి ఆదివారం వరకు నెల నెల వెన్నెల ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో 'ఖరీదైన జైళ్లు' నాటికకు ప్రథమ బహుమతి దక్కిందని న్యాయ నిర్ణయితలు.. ప్రముఖ సినీరంగస్థల నటులు సుబ్బరాయశర్మ, మేక రామకృష్ణ, ప్రముఖ థియేటర్ స్కాలర్ గోవిందరావు ఆదివారం రాత్రి ప్రకటించారు. 9బృందాలు ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకోగా.. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన ఖరీదైన జైళ్లు నాటిక ప్రథమ బహుమతికి ఎంపికైంది. హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి 'అమ్మ చెప్పిన బొమ్మ' నాటిక ఉత్తమ ద్వితీయ, తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ వారి విడాకులు కావాలి నాటిక మూడో బహుమతి గెలుచుకున్నాయి. ఉత్తమ నటుడుగా ఖరీదైన జైళ్లు నాటికలోని ముత్యాలు పాత్రధారి రమేష్ మంచాల, ఉత్తమ నటిగా అమ్మ చెక్కిన బొమ్మ అనసూయ పాత్రధారిని జ్యోతిరాజ్ ఎంపికయ్యారు. అలాగే ఖరీదైన జైళ్లు రచయిత పరమాత్ముని శివరామ్‌కు ఉత్తమ రచన, ఐ హేట్ ఇండియా దర్శకుడు డాక్టర్ ఎంఎస్ చౌదరి ఉత్తమ దర్శకత్వం.. ఇలా అన్ని విభాగాల్లో గెలుపొందిన వారిని సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు.



ఖరీదైన జైళ్లు నాటిక బృందానికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

## ఈవీఎంలతో ఓట్లు చోరీ చేసిన బీజేపీ

- డీసీసీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని వీక్షించిన నాయకులు





పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరైన నాయకులు, మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు జావీద్

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా బీజేపీ ఎన్నికల నిర్వాహణలో అనేక అక్రమాలకు పాల్పడిందని, ఈవీఎంలతో ఓట్లు చోరీ చేసిందని మేయర్ పునుకొల్లు నీరజ ఆరోపించారు.టీపీసీసీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఢిల్లీ నుంచి ఏఐసీసీ రాహుల్‌గాంధీ నిరసన కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యేకంగా వీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించి ప్రజాతీర్పును మార్చేసిందన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై ప్రజలకు వివరించేందుకు కార్యచరణ చేస్తున్నామన్నారు. అనేక రాష్ట్రాల్లో ఇటువంటి మోసాలను చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

## వైద్యశాఖ ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్





ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 11( ఆంధ్రజ్యోతి): రాష్ట్రఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు సోమవారంనగరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 10గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో 5కిలోమీటర్ల 'రెడ్‌రన్' కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి బి.కళావతిబాయి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. 5కిలోమీటర్ల రెడ్‌రన్ పరుగు పందెం పోటీలో పాల్గొన్నారు. మొదటి బహుమతి అఫ్రీన్‌కు వెయ్యిరూపాయలు, రెండోబహుమతి నాగజ్యోతికి ఐదువందలు అందచేశారు. బాలుర విభాగంలో ప్రథమ అనిల్, ద్వితీయ గోపికి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నెస్సెస్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా యూత్ అఫైర్స్ డీఎస్‌ఓ వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సిబ్బంది డి.సత్యకుమార్, మహమూద్ అలీ, వీరయ్య, రామక్రిష్ణ, నెహ్రూ యువ కేంద్రం భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## మాల అమరవీరుల సంస్మరణ సభ

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం మాల అమరవీరుల సంస్మరణ సభ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు గుంతేటి వీరభద్రం మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో అనేకమంది అమరులయ్యారని గుర్తు చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, ముదుసు జాకబ్‌ప్రతాప్, బాబురావు, తొగరు భాస్కర్, పేరం మల్లయ్య, కొరివి భాస్కర్ పాల్గొన్నారు.

## వైద్యుల నియామక జాబితాపై అభ్యంతరాలు తెలపాలి: డీసీహెచ్‌ఎస్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారుల పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూకు సంబంధించిన ఒప్పంద ఉద్యోగ నియామక ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే 14లోగా తెలపాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న తెలంగాణ వైద్యవిధాన పరిషత్, జిల్లా పరిధిలోని ఆసుపత్రులలో గైనకాలజీ, అనస్థీషియా, ఆప్తాల్మాలజీ, ఈఎన్టీ, జనరల్ మెడిసిన్, జనరల్‌సర్జన్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు కాంటాక్ట్ పద్ధతిలో నియమించేందుకు ఇంటర్వ్యూనిర్వహించినట్లు తెలిపారు. ఎంపిక జాబితా వెబ్సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆజాబితాపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే కలెక్టరేట్‌లోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో సమర్పించాలని రాజశేఖర్‌గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

## నిరుపేదలకు శాశ్వత నివాసాలు

**28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ**

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలోనిరుపేదలకు ప్రభుత్వమే ఇంటి నిర్మాణాలు చేసి ఇస్తోందని కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ పేర్కొన్నారు. 28వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ ముగ్గులు కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్కో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం నగరంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరుగుతున్నాయని తెలిపారు. నాయకులు సుంకర సతీష్ వర్మ, ఖదీర్, ఉప్పిరెడ్డి, గంగరబోయిన రవి, ఏపూరి కృష్ణ, సీలం, ఉపేందర్ పాల్గొన్నారు.



ఇళ్లకు ముగ్గులు కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ, నాయకులు వెంకన్న

## నగరంలో విస్తృతంగా డ్రైడే

- 14కు చేరిన డెంగీ కేసులు
- డివిజన్లలో లార్వా నివారణ మందులు పిచికారీ

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): నగరంలో డెంగీ కేసులు వరసగా నమోదు కావటంతో.. అర్బన్ మలేరియా అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం నాటికి నగరంలో 10పాజిటీవ్ కేసులు నమోదు జరిగాయి. దీంతో 10, 27, 42, 47 డివిజన్లలో మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బందితో పాటుగా అర్బన్ మలేరియా అధికారు మహమూద్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మంచి నీటి నిల్వలు, కూలర్లు, వ్యర్థాల వస్తువులలో నీటి నిల్వలను తొలగించారు. పాజిటీవ్ కేసులు నమోదు జరిగిన వారి నివాసాల సమీపంలోని 483ఇళ్లల్లో ఇంటింటి సర్వే చేపట్టి లార్వా నివారణ మందులను పిచికారీ చేశారు.

**వెంటాడుతున్న సిబ్బంది కొరత**

ఖమ్మంఅర్బన్ మలేరియా విభాగంలో ముగ్గురు పర్యవేక్షకులు ఆరుగురు హెల్త్ అసిస్టెంట్‌లు మాత్రమే ఉన్నారు. వీరిలో ఇద్దరు హెల్త్‌అసిస్టెంట్‌లు అనారోగ్య సెలవ్‌లో ఉన్నారు. దీంతో పాజిటీవ్ కేసులు నమోదు జరిగిన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించటం కష్టంగా మారుతోంది. కలెక్టర్ అనుదీప్, కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించి ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య సిబ్బందిని ఖమ్మంనగరానికి డిప్యూటేషన్ వేయించాలని కార్పొరేటర్లు కోరుతున్నారు. జిల్లావ్యాప్తంగా 60 డెంగీ పాజిటీవ్ కేసులు నమోదు కాగా ఖమ్మంలోనే 14కేసులు ఉన్నాయి. కేసుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



10వ డివిజన్‌లో లార్వా నివారణ మందులు పిచికారీ చేస్తున్న సిబ్బంది

## ప్రతీ చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలను అందిస్తాం

- నేలకొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్





ఆల్బెండజో మాత్రలు ఇస్తున్న వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, తిరుమలాయపాలెంలో..

నేలకొండపల్లి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతీచిన్నారికి నులిపురుగుల నివారణా మాత్రలు(ఆల్బెండజో) అందిస్తామని నేలకొండపల్లి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిపాఠశాలల్లో ఆల్బెండజో మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. రక్తహీనతకు నులిపురుగులే ప్రధాన కారణమన్నారు.నులిపురుగుల నివారణ అందరి బాధ్యతన్నారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య మాట్లాడుతూ మండలాన్ని నులిపురుగుల రహిత మండలంగా తీర్చిదిద్దాలని అందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో బాలిన చలపతిరావు, వైద్యులు ఎండి సన, ఎస్.నాగమణి, బి.అర్జున్, గౌతమ్ పాల్గొన్నారు.

**విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి**

తిరుమలాయపాలెం: విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జేడీఏ పుల్లయ్య చెప్పారు. సోమవారం వివిధ గ్రామాల్లో విద్యార్థులకు అల్బేండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మూడురోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యకరమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, వైద్యులు అవినాష్ మహీదర్‌రెడ్డి, ఏవో సీతారాంరెడ్డి, ఏఎన్‌ఎం నాగలక్ష్మీ, సీత, ఎస్టీ బాలికల వసతిగృహంసంక్షేమ అధికారి పూలన్‌దేవి పాల్గొన్నారు.

కామేపల్లి: నులిపురుగుల నివారణే లక్ష్యమని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.





## గంగమ్మతల్లి ఆలయానికి భూమిపూజ

**కార్యక్రమంలో పాల్గొన్న మల్లు నందిని**

ముదిగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమండవలో నూతనంగా నిర్మించనున్న గంగమ్మతల్లి దేవాలయ పూజా కార్యక్రమంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పాల్గొన్నారు. ఈ దేవాలయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ బులెట్‌బాబు, మల్లెల అజయ్, కోడె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మల్లు నందిని

# యువతరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించాలి

**డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారామ్**

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బాల్యదశలోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటే యుతరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సీతారామ్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని (ఎన్‌డీడీ) పురస్కరించుకుని సత్తుపల్లి విద్యార్థినిలకు ఆయన అల్బండజోల్ ట్యాబ్లెట్లను వేశారు. 19 ఏళ్లలోపు చిన్నారులకు ఈనెల 22వ తేదీ వరకు దశల వారీగా ట్యాబెట్లను అందిస్తామని, ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్లలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు టీమ్‌లుగా ఏర్పడి విద్యార్థులకు మాత్రలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.



సత్తుపల్లి రూరల్: విద్యార్థినికి ట్యాబ్లెట్ వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారామ్



విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న జడ్పీసీఈవో దీక్షారైనా

**పాఠశాలలను తనిఖీచేసిన జడ్పీ సీఈవో**

ఏన్కూరు : ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, గురుకుల విద్యాలయాన్ని సోమవారం జడ్పీ సీఈవో దీక్షారైనా ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజన శాలను, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, కేజీబీవీఎస్‌వో లావణ్య, జడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం రాఘవరావు, పీహెచ్‌సీ వైద్యుడు రాములు, స్టాఫ్‌నర్స్ శార స్వప్న, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**కొణిజర్ల మండలంలో...**

కొణిజర్ల : కొణిజర్ల ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను వేశారు. డాక్టర్ శారద మాట్లాడుతూ మండలంలోని 32 పాఠశాలలు, మూడు ప్రవేట్ పాఠశాలలు, రెండు సంక్షేమ హాస్టల్స్, 43 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను వేయడం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రయ్య, ఎంఈవో అబ్రహం, హెచ్‌ఎం శాంతకుమారి, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ దుర్గామల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్‌రావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

**కారేపల్లి మండలంలో...**

కారేపల్లి : మండల పరిధిలోని పలు పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. తెలంగాణ మోడల్ పాఠశాలలో ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. గాంధీనగరం ట్రైబల్ వేల్ఫ్‌వేర్ పాఠశాలలో ఏఎన్‌ఎం శ్యామల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

**చింతకాని మండలంలో...**

చింతకాని: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చింతకాని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్యాధికారి అల్తాఫ్, ఎంఈవో రామారావు, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రాణి, కృష్ణారావు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**మెరుగైన మానసిక, శారీక అభివృద్ధి**

ముదిగొండ: ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని నాన్ కమ్యూనికేబుల్ డిసెజ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు సూచించారు. సోమవారం ముదిగొండ జడ్పీహెచ్ స్కూల్ నందు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా పిల్లలకు రక్తహీనత తగ్గి పోషణ మెరుగుపడుతుందని, మెరుగైన మానసిక, శారీక అభివృద్ధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మండల వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి, వైద్యసిబ్బంది లత, అమూల్య, చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

**ఎర్రుపాలెం మండలంలో...**

ఎర్రుపాలెం : మండల కేంద్రమైన ఎర్రుపాలెం బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు 18వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరెడ్డి, ఏఎన్‌ఎంలు స్నేహ, వసంత, ఆశాకార్యకర్తలు విజయ, హేమలత పాల్గొన్నారు.

**నేషనల్ డీ వార్మింగ్ కార్యక్రమం విజయవంతం**

తల్లాడ: మండలంలో సోమవారం నేషనల్ డీ వార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో కార్యక్రమాన్ని వైద్యాధికారిణి డాక్టర్ కే.ప్రత్యూష ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీకేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీచేశారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసిన ఎమ్మెల్యే

వైరా: వైరాలో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైరా ప్రభుత్వ ఆస్పత్రి, పాఠశాలల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని 470 విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలు వేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశే ఖర్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సక్రియ, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీహర్ష, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లెట్లు వేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

## విధుల్లో సమర్థత చూపించండి

» రాజకీయంగా ఎటువంటి జోక్యం ఉండదు

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అధికారులంతా తమ విధుల్లో సమర్థత చూపించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుంటే ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. సోమవారం ఆయన ముందుగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీలోని అధికారులతో ఆ తర్వాత తమ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, మండల ప్రజాపరిష త్, గృహనిర్మాణ శాఖ ఇతర అన్ని శాఖల నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించటంలో రైతులు, ప్రజలకు సంబంధించిన భూ సంబంధిత, రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, వైద్యం, ఆరోగ్యం, విద్యా తదితర సమస్యలను పరిష్కరించడం ద్వారా అధికారులు తమ సమర్థతను చాటుకోవాలని సూచించారు. భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందని తెలిపారు. అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజాప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటిపై కమిషనర్ చింతా వేణు తో సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఈ సమీక్షలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీఐలు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణ, ట్రాన్స్‌కో, మున్సిపల్ డీఈలు, ఏఈలు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

## నాగులవంచ రైల్వేస్టేషన్ సేవలు కొనసాగించాలి

చింతకాని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నాగులవంచ రైల్వేస్టేషన్‌ను మూసివేయకుండా ప్రయాణికులకు సేవలు కొనసాగించాలని మధిర స్వేరోస్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ కోరారు. సోమవారం స్వేరోస్ బృందం నాగులవంచ రైల్వేస్టేషన్‌ను సందర్శించింది. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్టేషన్ మూసివేత ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీను, పరిటాల యలమంద, కోహూరి నవీన్, పాతర్లపాడు, రైల్వే కాలనీ గ్రామస్థులు పాల్గొన్నారు.

# దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలు

తల్లాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, యూపీలో దౌర్జన్యాలు మరీ పెచ్చుమీరుతున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో కేవీపీఎస్ మండల మహాసభ మేడి భిక్షం అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక బీజేపీ పాలిత రాష్ట్రాలైన యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాల్లో దళితులపై గంటకు 15 దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ బద్ధంగా రూపొందించిన ఎన్నికల కమిషన్, ఈడీ వంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై కక్షసాధింపులకు పాల్పడుతుందన్నారు. ఇటీవల కాలంలో బీహార్‌లో లక్షలాదిమంది దళితులు, మైనారిటీల ఓటర్లను గల్లంతు చేస్తూ దేశపౌరుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో కులగణన జరిగిన 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అన్ని రాజకీయపార్టీలు సంపూర్ణంగా బలపరిస్తే కేవలం ఒక్క బీజేపీ మాత్రమే వ్యతిరేకంగా నిలబడుతుందని అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మనువాదం నుండి రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా ఈనెల 15, 16, 17 తేదీల్లో సెమినార్లు నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. అనంతరం కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కర్లకంటి శ్రీనివాస్, మేడి బిక్షంతో పాటు మరో పది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, కోట అశోక్, కేవీపీఎస్ మండల నాయకులు కర్లకంటి శ్రీనివాస్, ఇస్నేపల్లి రవికుమార్, తెల్లపుట్ట యేసు, అమర్లపుడి భవాని, కొత్తపల్లి మహేష్, కాంపల్లి వీరయ్య, ఇనపనూరి శ్రీనివాసరావు, కిన్నెర వెంకటేష్, ఆదూరి వీరయ్య పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

## ట్రాక్టర్, ట్రక్కు ఎత్తుకెళ్లిన వ్యక్తికి జైలుశిక్ష

సత్తుపల్లిరూరల్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఓ పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్‌తో పాటు ట్రక్కును అపహరించిన వ్యక్తికి సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వడ్డె లావణ్య ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన కాకరకాయల నరేష్ ఈ ఏడాది జూన్ 6వ తేదీన కల్లూరు మండలం చెన్నూరులో దొంగతనానికి పాల్పడ్డాడు. చెన్నూరు శివారులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద అదే గ్రామానికి చెందిన చింతలపాటి సుబ్బారావుకు చెందిన ట్రాక్టర్‌తో పాటు ట్రక్కును పార్కింగ్ చేసి ఉంచగా నరేష్ అపహరించాడు. బాధితుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు ఎస్‌ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు సత్తుపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణ జరిపిన న్యాయమూర్తి ముద్దాయిపై నేరారోపణలు రుజువు కావడంతో ఆరు నెలల కారాగార శిక్ష విధించారు. ఈ కేసులో శిక్ష పడటంలో కల్లూరు పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ మల్లిఖార్జున్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జే.ప్రదీప్‌లు సహకరించారు.

# ఘనంగా ఎమ్మెల్యే రాగమయి జన్మదిన వేడుకలు

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కల్లూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బత్తులపల్లి, కప్పలబంధం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్‌లు కేక్ కట్‌చేసి ఎమ్మెల్యే రాగమయికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పేరువంచ, చంద్రుపట్ల, యర్రబోయినపల్లి తదితర గ్రామాల్లో కూడా ఎమ్మెల్యే రాగమయి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో కూడా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. నోట్‌పుస్తకాలు, పెన్నులు వితరణ చేసిన తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్‌ను పలువురు అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కినేని కృష్ణ, కీసర మధుసూదన్‌రెడ్డి, పోట్రు అర్జునరావు, ఎస్‌కే యాఖుబ్‌అలి, తల్లపురెడ్డి హనిమిరెడ్డి, కాటంనేని బాబూరావు, లింగబోయిన పుల్లారావు, ముకర విజయరావు, జిల్లెల భాస్కరరెడ్డి, పెద్దబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చందర్‌రావు, దుర్గాప్రసాద్

## కందుకూరులో..

వేంసూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పుట్టినరోజు వేడుకలను సోమవారం కందుకూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బర్త్‌డే కేక్‌ను ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గొర్ల వెంకటప్పారెడ్డి కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ నాయకులు కొప్పుల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మర్లపాడులో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెల్ది జగన్మోహన్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, భీమిరెడ్డి పావని, శ్రీనివాసరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, మోరంపూడి వెంకటకృష్ణ నర్సింహారావు, కన్మతరెడ్డి రంగారెడ్డి, గన్నేని సురేష్, ఒగ్గు సత్యనారాయణరెడ్డి, మోరంపూడి శ్రీరామ్ సుధీర్, దాసరి రామకృష్ణారెడ్డి, గడిపర్తి రామారావు, రాయల భద్రయ్య, కొండపల్లి పుల్లారెడ్డి, యర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి ఎమ్మెల్యే సన్మానం

పెనుబల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని పెనుబల్లికి చెందిన చెన్ను జోషికను సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సన్మానించి, విద్యలో మంచిగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఎంఈవో ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు రవికుమార్, బండి రాము పాల్గొన్నారు.

## తిరువూరులో తప్పిపోయిన తాళ్లపెంట విద్యార్థి ఆచూకీ లభ్యం

పెనుబల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నవోదయ కోచింగ్ సెంటర్‌కు వెళ్లిన ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం తాళ్లపెంటకు చెందిన పసుపులేటి రుద్ర సాయితేజ అనే విద్యార్థి ఆచూకీ ఏపీలోని గుడివాడలో సోమవారం లభ్యమైంది. తాళ్లపెంట గ్రామానికి చెందిన పసుపులేటి నాగశ్రీనివాసరావు కుమారుడు రుద్రసాయితేజ తిరువూరులో నవోదయ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రతిరోజూ అతను ఇంటి నుంచి ఆటోలో తిరువూరుకు వెళ్లాడు. సమయం గడిచినప్పటికీ అతను కోచింగ్ సెంటర్‌కు రాకపోవడంతో నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం సాయంత్రానికి విద్యార్థి ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

## అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలి

వైరా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని సొసైటీ గోదాముల వద్ద రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్, సొసైటీ అధికారుల ముందు నిరసన వ్యక్తం చేశారు. పేరుకు లారీ లోడ్ యూరియా అని చెప్పినప్పటికీ దాంట్లో కేవలం 200 యూరియా బస్తాలు మాత్రమే వస్తున్నాయని, దీంతో రైతుల అవసరం తీరెదెలా అని నిలదీశారు. పంట పొలాలు వదిలి ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫోన్ ద్వారా జిల్లా వ్యవసా య అధికారులకు రాంబాబు వివరించారు. ఏవో మాట్లాడుతూ రెండు రోజుల్లో రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతుసంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, వెంపటి నాగేశ్వరరావు, గుమ్మా మురళీ, సంక్రాంతి నర్సయ్య, బొల్లం రామయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



ఏవో మంజూఖాన్‌ను ప్రశ్నిస్తున్న రైతుసంఘం నాయకుడు బొంతు రాంబాబు

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చు

తల్లాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్ అన్నారు. సోమవారం తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బిల్లుపాడులో ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించారు. స్థానికంగా ఆయన పలు నివాస గృహాలలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ నిష్మా, హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుడి కిషోర్, సామినేని రామ అప్పారావు పాల్గొన్నారు.

## భగీరథ ప్లాంట్ వద్ద పైప్‌లైన్ లీకేజీ

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లాడ మండలం గూడూరు ప్లాంట్ వద్ద భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీ కావటంతో నాలుగు రోజుల నుంచి నాలుగు మండలాల ప్రజలకు భగీరథ మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యతో ప్రత్యామ్నాయంగా గ్రామ పంచాయితీల పరిధిలో గతంలో ఉన్న మోటారు పంపులతో నీటిని తోడి తద్వారా మంచి నీటి పథకాలకు స్థానిక పంచాయితీ వారు అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై భగీరథ అధికారులను వివరణ కోరగా సత్వర చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

ఏన్కూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాహుల్‌గాంధీని వెంటనే విడుదల చేయాలని, మోదీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఓట్ల చోరీని దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని ఆందోళనతోనే అరెస్టు చేశారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మహిళ సంఘం మండల అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతిరెడ్డి, మండల నాయకులు మేడా ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, చందమామ నరసింహారావు, భూక్యా లాలునాయక్, లచ్చిరాంనాయక్, పటాన్ మజీద్‌ఖాన్, గాలిబ్‌సాహెబ్, నిమ్మల నాగేశ్వరరావు, పాలెం శేఖర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

ఏన్కూరు, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు డు మాజీ ఉపసర్పంచ్ పూర్ణకంటి మోసా(70) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సొసైటీ ఛైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల నాయకులు మేడా ధర్మారావు, కట్టా సత్యనారాయణ, వాసిరెడ్డి నాగేశ్వరరావు, లచ్చిరాంనాయక్, భూక్యా చందులాల్‌నాయక్, చింతనబోయిన సీతారాములు, వీరునాయక్, శ్రీనివాసరావు ఉన్నారు.



పూర్ణకంటి మోసా

## అయ్యప్ప ఆలయానికి రూ.5లక్షల విరాళం

సత్తుపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయానికి బెంగుళూరుకు చెందిన వాసవీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గాదంశెట్టి నాగరాజు రూ.5లక్షల చెక్కును ఆలయ కమిటీ ఛైర్మన్‌కు సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గణపతి హోమం అయ్యప్ప స్వామికి అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీసభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ దోసపాటి అరమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అర్చకులు సురేష్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాగరాజు

## తీగలబంజరలో ముత్యాలమ్మ ఆలయానికి శంకుస్థాపన

కొణిజర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగలబంజర గ్రామంలో గ్రామ దేవతగా కొలువుదీరిన ముత్యాలమ్మ నూతన ఆలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పురోహితులు కేతముక్కల సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యాక్రమాలు జరిగాయి. శంకుస్థాపనకు ముందుగా గ్రామంలో శంఖుతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అధికసంఖ్యలో పూజలో పాల్గొన్నారు. శ్రావణమాసంలో గ్రామంలో నూతనంగా చేపట్టనున్న ఆలయంకు శంకుస్థాపన జరగటంతో గ్రామంలో పండుగవాతావరణం నెలకొన్నది.

## కాంగ్రెస్ నేతకు మాజీ ఎమ్మెల్యే కొండబాల పరామర్శ

బోనకల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు సోదరుడు వెంకట నారాయణ మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, బందం శ్రీనివాసరావు, బందం నాగేశ్వరరావు, నల్లమోతు సత్యనారాయణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



మృతదేహాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కొండబాల

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చింతకాని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల వనరుల కేంద్రంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐఈఆర్పీగా పనిచేస్తున్న కవికొండల కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు మండల విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాల తరఫున మృతుని కుటుంబానికి రూ.58 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సలాది రామారావు, ఉపాధ్యాయులు ఉదారపు నాగేశ్వరరావు, రాంబాబు, చెన్నకేశవరెడ్డి విజయభాస్కర్, శివకుమార్, జమలయ్య, దస్లీ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

## పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ధర్నా

మధిర రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ కమిటీలను రద్దుచేయాలని కోరుతూ సోమవారం సీపీఎం, వ్యకాసం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అర్హులకు ఇళ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. మధిర సీపీఎం కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో, మండలంలో అర్హులైన చాలామంది పేదలకు ఇళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, వ్యకాసం నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**250 టన్నుల యూరియా విక్రయం : చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి**

చింతకాని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చింతకాని సొసైటీ ద్వారా నెలలోనే 250 టన్నుల యూరియాను రైతులకు విక్రయించినట్లు సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తెలిపారు. గతేడాది జూన్, జూలైలో 40టన్నుల యూరియా మాత్రమే విక్రయించామన్నారు. యూరియా కొరత లేకుండా సకాలంలో ఎరువులను అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.